# పోతన
# గజేంద్రమోక్షము
## (భాగవతం –అష్టమ స్కంధం)

చదువరి

డా.రామక పాండురంగ శర్మ

http://telugubhagavatam.org/

పోతన తెలుగుభాగవతం

వారి సౌజన్యంతో ....

# కలడో ? లేడో

కం.

కలఁడందురు దీనుల యెడఁ,
గలఁడందురు పరమయోగి గణముల పాలం,
గలఁడందు రన్నిదిశలను,
**గలఁడు కలం డనెడి వాఁడు గలఁడో లేఁడో?**

# వేగ రాడె?

కలుగఁడే నాపాలికలిమి సందేహింపఁ;
గలిమిలేములు లేకఁ గలుగువాఁడు ?
నాకడ్డపడ రాఁడె నలి నసాధువులచేఁ;
బడిన సాధుల కడ్డపడెడువాఁడు ?
చూడఁడే నా పాటుఁ జూపులఁ జూడకఁ;
జూచువారలఁ గృపఁ జూచువాఁడు ?
లీలతో నా మొఱాలింపఁడే మొఱఁగుల;
మొఱ లెఱుంగుచు దన్ను మొఱఁగువాఁడు ?

- అఖిల రూపముల్ దనరూప మైనవాఁడు
  ఆదిమధ్యాంతములు లేక యడరువాఁడు
  భక్తజనముల దీనుల పాలివాఁడు
  వినఁడె ? చూడఁడె ? తలఁపడె ? వేగ రాఁడె ?

- విశ్వకరు విశ్వదూరుని
  విశ్వాత్ముని విశ్వవేద్యు విశ్వు నవిశ్వున్
  శాశ్వతు నజు బ్రహ్మప్రభు
  నీశ్వరునిం బరమపురుషు నేభజియింతున్.

# నీవే తప్ప ...

అని పలికి, తన మనంబున నగ్గజేంద్రుం డీశ్వర సన్నిధానంబు కల్పించుకొని యిట్లనియె.

"**లావొక్కింతయు లేదు**; ధైర్యము విలోలంబయ్యెఁ; బ్రాణంబులున్
ఠావుల్‌దప్పెను; మూర్ఛ వచ్చెఁ; దనువున్ డస్సెన్; శ్రమంబయ్యెడిన్;
**నీవేతప్ప నితఃపరం బెఱుఁగ**; మన్నింపందగున్ దీనునిన్;
రావే యీశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా!

విను దఁట జీవుల మాటలు;
చను దఁట చనరానిచోట్ల; శరణార్థుల "కో
యను"ను దఁట పిలిచిన; సర్వము఼
గను దఁట; **సందేహ మయ్యెఁ గరుణావార్ధీ!**

# నన్నుగావవే

ఓ కమలాప్త! యో వరద! యో ప్రతిపక్షవిపక్షదూర! కు
య్యో! కవియోగివంద్య! సుగుణోత్తమ! యో శరణాగతామరా
నోకహ! యో మునీశ్వర మనోహర! యో విమలప్రభావ! రా
వే! కరుణింపవే! తలఁపవే! శరణార్థిని నన్నుగావవే!”

అని పలికి మఱియు "నరక్షిత రక్షకుండైన యీశ్వరుం డాపన్నుఁడైన నన్నుఁ గాచుఁ గాక!" యని నింగి నిక్కి చూచుచు, నిట్టూర్పులు నిగడించుచు, బయ లాలకించుచు నగ్గజేంద్రుండు మొఱచేయుచున్న సమయంబున.

# విష్ణుండు అడ్డపడఁ దలంచె

విశ్వమయత లేమి వినియు నూరక యుండి
రంబుజాసనాదు లడ్డపడక
విశ్వమయుఁడు, విభుఁడు, విష్ణుండు, జిష్ణుండు
భక్తియుతున కడ్డపడఁ దలంచె.

# సిరికిం జెప్పడు

అల వైకుంఠపురంబులో నగరిలో నా మూలసౌధంబు దా
పల మందారవనాంతరామృత సరః ప్రాంతేందు కాంతోపలో
త్పల పర్యంక రమావినోది యగు నాపన్నప్రసన్నుండు వి
హ్వల నాగేంద్రము "పాహిపాహి" యనఁ గుయ్యాలించి సంరంభియై.

సిరికిం జెప్పఁడు; శంఖ చక్ర యుగముం జేదోయి సంధింపఁ; డే
పరివారంబునుఁ జీరఁ; డభ్రగపతిం బన్నింపఁ; డాకర్ణికాం
తర ధమ్మిల్లముఁ జక్క నొత్తఁడు; వివాదప్రోత్థితశ్రీకుచో
పరిచేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై.

Teluguthesis.com

# ఆబాలగోపాలమున్

ఇట్లు భక్తజనపాలన పరాయణుండును, నిఖిల జంతు హృదయారవింద సదన సంస్థితుండును నగు నారాయణుండు కరికులేంద్ర విజ్ఞాపిత నానావిధ దీనాలాపంబు లాకర్ణించి, లక్ష్మీకాంతా వినోదంబులం దగులు సాలించి, సంభ్రమించి దిశలు నిరీక్షించి, గజేంద్రరక్షాపరత్వంబు నంగీకరించి, నిజపరికరంబు మరల నవధరించి, గగనంబున కుద్గమించి వేంచేయు నప్పుడు.

తనవెంటన్ సిరి ; లచ్చివెంట నవరోధవ్రాతమున్ ; దాని వె
న్కనుఁ బక్షీంద్రుఁడు ; వాని పొంతను ధనుఃకౌమోదకీ, శంఖ, చ
క్రనికాయంబును ; నారదుండు ; ధ్వజినీకాంతుండు రా వచ్చి రొ
య్యన వైకుంఠపురంబునం గలుగువా రాబాలగోపాలమున్.

# ఎందుకో

తదనంతరంబ, ముఖారవింద మకరందబిందు సందోహ పరిష్యందమానానం దేందిందిర యగు న య్యిందిరాదేవి గోవింద కరారవింద సమాకృష్యమాణ సంవ్యానచేలాంచల యై పోవుచు.

తన వెంచేయు పదంబుఁ బేర్కొనఁ; డనాథస్త్రీ జనాలాపముల్
వినెనో? ఘ్రుచ్చులు ఘ్రుచ్చలించిరో ఖలుల్ వేదప్రపంచంబులన్?
దనుజానీకము దేవతానగరిపై దండెత్తెనో? భక్తులం
గని చక్రాయుధుఁ డేఁడి చూపుఁ డని ధిక్కారించిరో? దుర్జనుల్.

అని వితర్కించుచు.

# వడివడి....

అడిగెద నని కడువడిఁ జను;

నడిగినఁ దను మగుడ నుడుగఁ డని నడ యుడుగున్;

వెడవెడ సిడిముడి తడఁబడ

నడు గిడు; నడుగిడదు జడిమ నడు గిడునెడలన్

# చనుదెంచెన్ ....

- వినువీథిన్ జనుదేరఁ గాంచి రమరుల్ విష్ణున్, సురారాతి జీ
  వనసంపత్తి నిరాకరిష్ణుఁ, గరుణావర్ధిష్ణుఁ, యోగీంద్ర హృ
  ద్వనవర్తిష్ణు, సహిష్ణు, భక్తజనబృందప్రాభవాలంకరి
  ష్ణు, నవోఢోల్లసదిందిరా పరిచరిష్ణున్, జిష్ణు, రోచిష్ణునిన్.

- చనుదెంచెన్ ఘనుఁ డల్లవాఁడె; హరి పజ్జం గంటిరే లక్ష్మి? శం
  ఖ నినాదం బదె; చక్ర మల్లదె; భుజంగధ్వంసియున్ వాఁడె; క్ర
  న్నన యేతెంచె" నటంచు వేల్పులు "నమోనారాయణాయేతి" ని
  స్వనులై మ్రొక్కిరి మింట హస్తిదురవస్థావక్రికిం జక్రికిన్.

# పంకజాకరం

అ య్యవసరంబునఁ గుంజరేంద్రపాలన పారవశ్యంబున దేవతానమస్కారంబు లంగీకరింపక మనస్సమాన సంచారుం డై పోయిపోయి, కొంతదూరంబున శింశుమారచక్రంబునుం బోలె గురుమకరకుళీర మీనమిథునంబై; కిన్నరేంద్రుని భాండాగారంబునుంబోలె స్వచ్ఛ మకరకచ్ఛపంబై; భాగ్యవంతుని భాగధేయంబునుంబోలె సరాగ జీవనంబై; వైకుంఠపురంబునుంబోలె శంఖచక్ర కమలాలంకృతంబై; సంసార చక్రంబునుంబోలె ద్వంద్వసంకుల పంక సంకీర్ణంబై యొప్పు నప్పంకజాకరంబుఁ బొడగని.

# ఖండింపగా బంపి ...

కరుణాసింధుఁడు శౌరి వారిచరమున్ ఖండింపఁగాఁ బంపె స
త్త్వరితాకంపిత భూమిచక్రము, మహోద్యద్విస్ఫులింగచ్ఛటా
పరిభూతాంబర శుక్రమున్, బహువిధబ్రహ్మాండభాండచ్ఛటాం
తరనిర్వక్రముఁ, బాలితాఖిల సుధాంధశ్చక్రముం, జక్రమున్

ఇట్లు పంచిన.

అంభోజాకరమధ్య నూతన నలిన్యాలింగన క్రీడ నా
రంభుం డైన వెలుంగుఱేని చెలువారన్ వచ్చి, నీటన్ గుభుల్
గుంభద్ధ్వానముతోఁ గొలంకును కలంకం బొందఁగా జొచ్చి, దు
ష్టాంభోవర్తి వసించు చక్కటికి డాయంబోయి హృద్వేగమై.

# సుదర్శనం ....

- భీమంబై తలఁ ద్రుంచి ప్రాణములఁ బాపెం జక్ర మా శుక్రియన్,
  హేమక్ష్మాధర దేహముం, జకితవన్యేభేంద్ర సందోహముం,
  గామక్రోధన గేహమున్, గరటి రక్తస్రావ గాహంబు, ని
  స్సీమోత్సాహము, వీత దాహము, జయశ్రీ మోహమున్, గ్రాహమున్.

- ఇట్లు నిమిష స్పర్శనంబున సుదర్శనంబు మకరితలఁ ద్రుంచు నవసరంబున

- మకర మొకటి రవిఁ జొచ్చెను;
  మకరము మఱియొకటి ధనదు మాటున డాఁగెన్;
  మకరాలయమునఁ దిరిగెడు
  మకరంబులు కూర్మరాజు మఱువున కరిగెన్

# ఈ పాఠం...

http://telugubhagavatam.org/

పోతన తెలుగుభాగవతం

వారి సౌజన్యంతో ....

ఊలపల్లి సాంబశివరావు గారికి కృతజ్ఞతలతో...

Academy.TeluguThesis.com

వారి సమర్పణ

డా.రామక పాండురంగ శర్మ